ఏది ఉత్తమ రచన?

"అబ్బే నీ పుస్తకం బాగాలేదు" అంటారు పాఠకులు.

"నేను రాసింది నీకోసం కాదు" అంటాడు రచయిత.

చదువుకునేవాళ్ళకోసం కాదు రాసింది అనటం సాహసమే! కాని, తాము కష్టపడి, బుర్ర బద్దలుకొట్టుకొని, రాత్రింబగళ్లు కష్టపడి రాసింది 'బాగాలేదు' అని చప్పరించే టప్పటికి వాళ్లు మండిపోతుంది. రచయిత ప్రజలకు రుచించాలనే రాస్తాడు. పదిమందిచేతా బాగుందనిపించుకొని సంతోషించాలనే రాస్తాడు—పేరు సంపాదించుకోవాలనే రాస్తాడు.

కాని తాను రాసింది బాగాలే దనేటప్పటికి వెంటనే ఈ మాట అనేస్తాడు—"నేను రాసింది నీకోసం కాదు."

"మరెవరికోసం?"

రచయిత తెలివిగలవాడు అవటంవల్ల ఈ ప్రశ్నకు సమాధానాలు వెతుకుతాడు.

"నేను రాసేది రసహృదయులకు."

"నేను రాసేది సహృదయులకు."

"ఈ రసహృదయులూ, సహృదయులూ ఎవ్వరు?" అని ప్రశ్నిస్తే తాను రాసింది బాగుంది అని చెప్పేవారే అని తేలుతుంది.

ఇదంతా కూడా, ఈ ఆర్గుమెంట్లన్నీ కూడా తన ప్రయత్నం నిష్ఫలమైందనే ఆశాభంగంవల్ల కలిగినవేగాని, యథార్థమైనవి కావు. తాను అనేక పుస్తకాలు చదివాడు. తన కాలాన్నంతా చదువుకే వెచ్చించాడు. ఆర్థికంగా అనేక కష్టాలు పడ్డాడు. సంపాదన వైపుకి చూపుని పోనివ్వకుండా పుస్తకాల తాళింపుతో తన మెదడుని వేయించాడు. ఇంతా చేసి, తీరా పుస్తకం రాసేటప్పటికి యిదా ప్రతిఫలం? కసితో ప్రజలను దూరం చేసుకునే వాదంలేవదీస్తాడు. "కళ కోసం కళ—నా కోసమే నేను రాస్తున్నాను" అంటాడు. "ఎక్కడో ఒకడుండి ఆనందిస్తే చాలదూ?" అని తృప్తి పడతాడు. "పోనీ, ఇప్పటివాళ్ళకి అర్థం కాకపోయినా, పుట్టే వాళ్ళు ఆనందించరూ?" ఇలా అనుకొని తన తత్వాన్నే బలపరచుకోటానికి ప్రయత్నిస్తాడుగాని, ప్రజలకు అర్థమయ్యే రుచించే పద్ధతికోసం వెతకడు, పైగా యిందుకు ప్రయత్నించటం తన పరువుకి నష్టమనుకునే స్థితికూడా వస్తాడు.

రచయిత లందరూ ప్రజలకు తాము రాసేది బాగుండాలనే రాస్తారుగదా! కొన్ని కొన్ని రచనలు ప్రజలకు బాగుండక పోవటానికి కారణం ఏమిటి? అప్పుడు రచయితలు ఏం చెయ్యాలి? అని కొందరు ప్రశ్నిస్తారు.

"ప్రజలు అజ్ఞానులు" అని చెప్పి వాళ్ళను వొదిలి పెట్టటంలో అర్థంలేదు. ఎందుకంటే ప్రజలు అజ్ఞానులూ, తాను జ్ఞానీ కావటంవల్లే తాను రాయటం, వాళ్లు చదవటం జరుగుతూవుంది. ఇక జ్ఞానులకే రాస్తానంటాడా? జ్ఞాని,

తాను రాసింది చదవాల్సిన స్థితిలో వుండడు. తానే రాసి చదివించుకునే స్థితిలో వుంటాడు.

రచయితకు రాయాలనే కోర్కె మొదట్లో కలిగినప్పుడు ప్రజల శ్రేయస్సే కారణంగా వుండదు. అసలు ప్రజలనేవాళ్లున్నారనీ వాళ్లు చదివి ఇంతో అంతో బాగుపడ్డానికి పుస్తకం రాస్తున్నాననే సంగతే రచయితకు తట్టదు. ఎంతసేపూ పుస్తకం రాయాలనే అభిలాషే. అభిలాష! పుస్తకం రాయాలి! పుస్తకం అచ్చవ్వాలి? గ్రంథకర్తగా పేరు పడాలి! నేను చూచుకోవాలి! అనే రంధి తప్ప, ప్రజలకు అర్థమయ్యేటట్టు రాయాలనే సంగతే తట్టదు.

పుస్తకాలు రాసి పేరు సంపాదించుకున్న వాళ్ళని చూస్తాం; పేరు సంపాదించుకొని సన్మానాలు పొందేవాళ్ళని చూస్తాం; మనకూ పుస్తకం రాయాలనే ఉబలాటం కలుగుతుంది. అభిమాన రచయితల్ని అనుకరిస్తాం. బొత్తిగా కాపీ కొట్టటం మనస్కరించక ఒక రచయిత టెక్నిక్కూ, ఒక రచయిత భావాలూ తీసుకొని పెనవేసి పుస్తకాన్ని పూర్తి చేస్తాం. పై యిద్దరికంటే మంచి పుస్తకం రాశాం అనుకుంటాం.

ఈ విధంగా భావాలూ రచనా పద్ధతీ తెచ్చుకుంటాం. ఇక శైలి విషయం వస్తుంది. ఇదివరకు రాసే అలవాటు లేకపోవడంవల్లా, కృషి తక్కువ అవటంవల్లా మనశైలి మనకే తృప్తికరంగా ఉండదు; ఏదో ల్లేనట్టుగా వుంటుంది; కుంటుపడ్డట్టుగా ఉంటుంది.

ఏం చెయ్యాలి?

తేలిక పద్ధతులకు అలవాటుపడ్డ ప్రాణం అవటంవల్ల మరొక తేలిక పద్ధతి ఆలోచిస్తాం. మనం చదివిన పుస్తకాలు తిరగవేస్తాం. మంచి మంచి మాటలూ, సమాసాలూ ఏరు కుంటాం. మన పుస్తకంలో కుక్కి సొంతం చేసుకుంటాం.

అందువల్ల శైలి ఒకరకంగా వుండదు. పేజీ పేజీకి మారుతుంది. పేరగ్రాఫ్ పేరగ్రాఫ్‌కీ మారుతుంది. ఎవ్వరైనా ఈ లోటు చూపిస్తే దిద్దుకోటానికి ప్రయత్నించక ఒక కారణం ఊహించి తపీమని వాడి మొహాన విసిరికొడతాం.

"రసాన్నిబట్టి శైలిని మార్చానోయ్! గ్రహించ లేకపోతే, ఆస్వాదించ లేకపోతే—ఊరుకో" అంటాం.

అతడు మనస్సులో అనుకోవలసిందేదో అనుకొని, పైకి మెదలకుండా ఊరుకుంటాడు. మనమేమో, 'గెలిచాం; నోరు మూయించాం' అని భుజాలు ఎగరవేస్తాం.

ఇక, పుస్తకం అచ్చయి వొస్తుంది. మనం రాసిందే పదే పదే చదువుకుంటాం—ఎన్నిసార్లు చదివినా తనివి తీరందే! పైగా రాసినప్పటికంటే, అచ్చయిం తర్వాత ఇంకా అందంగా కనిపిస్తుందాయెను!

గ్రంథకర్తగా అచ్చయిన మనపేరు మనల్ని ఎంతగా ఆకర్షిస్తుంది! ఎన్నిసార్లు చదువుకుంటాం! ఎన్నిసార్లు చూచు కుంటాం! ఆ పేరు—మన పేరే!—ఎక్సర్‌సైజ్ పుస్త కాలమీదా, పరీక్ష పేపర్లమీదా, టెక్స్టు బుక్కులమీదా, ముద్దుగా, బండగా, గొంగళి పురుగులాగా కనబడే ఆ పేరే, ఇప్పుడు గ్రంథకర్తగా ఎంత ముద్దులొలుకుతూ కనిపిస్తుంది!

ఆ స్థితిలో రచయిత తనకు తానే, తన పేరునే మోహిస్తాడు—కామిస్తాడు—కాదు ప్రేమిస్తాడు. పుస్తకంమీద పేరుని చూచుకొని, పుస్తకాన్ని రొమ్ముమీద పెట్టుకొని నిద్రపోయి, రెండు రాజహంసలు తన పేరుని తలోక చివరా ముక్కుల్తో సుతారంగా పట్టుకొని, రివ్వున యెగిరి ముత్యాల హారాన్ని పట్టుకపోతున్నట్లుగా స్వర్గానికి ఎత్తుక పోతున్నట్లు కలలు కంటాడు!

ఈ అవస్తలో ప్రజలకు తావేముంది! ఈ పుస్తకాన్ని ప్రజలు ఆదరించకపోవటంలో ఆశ్చర్యమేముంది? ఆర్గుమెంట్సు చెప్పటంవల్లా, ప్రజలను నిందించటంవల్లా ప్రయోజనం ఏముంది?

ఎవరయినా కనిపిస్తే "నా పుస్తకం ఎలావుంది?" అని అడగటానికి భయం వేస్తుంది. బాగులేదంటే! అందుకని ఎలావుందని అడక్కుండా - మనస్సు ఒకపక్క పీకుతున్నా సరే! పిచ్చాపాటీ మాట్లాడి అతనికి అవకాశం ఇవ్వకుండా దూసుకుంటాం. లేకపోతే, మనం ఏంరాసినా బాగుంటుం దని చెప్పే స్నేహితుణ్ణిపట్టుకొని అడుగుతాం. "నా పుస్తకం చదివావా?"

"చూశాను" అంటాడు.

'చదివావా?' అని అడిగితే 'చూశాను' అని చెప్పి నందుకూ, 'ఎలావుంది?' అని అడక్కుండానే 'బాగుంది' అని చెప్పనందుకూ, విసుగుపుడుతుంది. విసుగుతోనే "ఎలా వుంది?" అని అడుగుతాం.

"బాగానే వుంది" అంటాడు.

"బాగానేవుందా? బాగుందా?"

"బాగుంది."

"బాగుందా? చాలా బాగుందా?"

"చాలా బాగుంది"

ఈ విధంగా చెప్పించుకొని తృప్తిపడతాం. ఇక ప్రజలకు నచ్చలేదు అనడంలో అర్థంలేదు. అందుకు ప్రయత్నమేదీ? ఇదొక రకం.

రచయితల్లో మరొక రకంవుంది. భాషలో ఎక్కువ కృషి చేసి, భావాలకంటే భాషకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటారు. కాని భాషకోసం ఈరోజుల్లో ఎవరు పుస్తకాలు చదువుతారు? భావదారిద్ర్యాన్ని భాషాపాండిత్యంతో కప్పిపుస్తే ప్రజలు ఆ పుస్తకాలు ఎందుకు చదువుతారు? ఒకవేళ చదివినా ఎలా ఆనందిస్తారు. కనక ఈ రకంకూడా "వాళ్ళకు నచ్చలేదు" అనే తృప్తిపడాల్సి వొస్తుంది. "మేం పండితులం, భాషలో బాగా కృషిచేశాం. వ్యాకరణం శుద్ధంగా చదువుకున్నాం. అయినా ఈ మూఢులు మమ్మల్ని ఆదరించటంలేదు" అనుకోవటంవల్ల వూడిపడే దేమీలేదు.

నేను రాసిన పుస్తకం చదవమని ఒక పెద్దమనిషికిచ్చాను. అతడు తీసుకువెళ్ళి, రాత్రి చదివి, తెల్లవారగట్ట భద్రంగా తీసుకువచ్చి ఇచ్చాడు.

"ఎలావుంది?" అని అడిగాను.

"సాభ్రాతృత్వం అని రాశారే! అక్కడ కరారావడి కాదు వుండవలసింది. వత్రసుడి ఉండాలి" అన్నాడు.

అంతే! ఇంతకు తప్పితే అతడు పుస్తకాన్ని గురించి ఏమీ చెప్పలేదు. ఈ అభిప్రాయం తప్పనిగానీ, ఈ అభిప్రాయం రైటనిగానీ, ఈ అభిప్రాయం బాగుందనిగానీ, ఈ అభిప్రాయం బాగాలేదనిగానీ ఏమీ చెప్పలేదు. అసలు ఆ పుస్తకంలో నేను వెలిబుచ్చిన అభిప్రాయాల జోలికి అతడు వెళ్ళేఉండడు. "ఆ కరారావిడి తీసి వత్రసుడి పెట్టండి" అని చెప్పి నా పుస్తకం నాకిచ్చి తనదారిన తాను వెళ్ళాడు.

ఇతడు తర్వాత ఒక పుస్తకం రాశాడు. ఎక్కడ కరారావిడి పెట్టాలో అక్కడ కరారావిడి పెట్టాడు. ఎక్కడ వత్రసుడి ఉంచాలో అక్కడ వత్రసుడి ఉంచాడు. ఎక్కడ బండిరా పెట్టాలో అక్కడ బండిరా పెట్టాడు.

కాని అంతే!

భాష, భావాలను వెలిబుచ్చటానికి ఉపయోగపడే సాధనం మాత్రమే అనే సంగతే మరచిపోయాడు. బండి రాళ్ళలో కరారావళ్ళలో పడి అసలు భావాలను గురించి ఆలోచించటానికే తీరిక ఉండిఉండదా? ఇలా రాసిన పుస్తకాలు ప్రజలకు నచ్చుమంటే ఎలా నచ్చుతయ్? మనం ఎన్ని గ్రంథాలు చదువుకుంటే వాళ్ళకేం? ఎన్ని సూత్రాలు మననం చేస్తే వాళ్ళకేం?

రచయితలకూ, ప్రజలకూ కలవకపోవటంవల్ల వచ్చే బాధలను కొంతమంది రచయితలు చూస్తారు. చూసి యీ

బాధలు తప్పించుకోటానికి సులిసూత్రం ఒకటి కనిపెడతారు. అదేమిటంటే ప్రజల్లో వ్యాపించివున్న మూఢాచారాలను తేలిక భాషలో వాళ్ళకు అర్థమయ్యేట్టు పొగట్టం. ఈ రకం రచయితలకు, కావలసినంత ప్రజాదరణ వుంటుంది. "రాస్తే, ఆయన రాసినట్టు రాయాల్రా" అంటుంది ప్రజ. కాని వీళ్ళ వల్ల మిగిలిన వాళ్ళందరికంటే ప్రజలకు ఎక్కువ అపకారం కలుగుతుంది. వాళ్ళని ఇంకా అజ్ఞానదశకు తీసుకుపోవటానికే వీళ్ళు ఉపయోగపడతారు. "వాళ్ళకు నచ్చలేదు-" అనే చింత వీళ్ళకు లేదు. ప్రజలు వీళ్ళపక్షమే వుంటారు. కాని, ప్రజల శ్రేయస్సు కోరేవాళ్లుమాత్రం వీళ్ళకు ప్రజాదరణ లేకుండా చెయ్యాలి. ప్రజల ఆదరం ఒక్కటే ఉత్తమగ్రంథ లక్షణంకాదు. ప్రజల శ్రేయస్సుకు సహాయపడే భావాలు వెలిబుచ్చుతూ వాళ్ళ ఆదరాభిమానాల్ని సంపాదించాలి.

ఇలా రాసే రచయితలు మరొకటి గమనించాల్సి వొస్తుంది. మొదట్లో "వాళ్ళకు నచ్చలేదు" అని బెదిరిపో గూడదు. వాళ్ళు అలవాటుపడ్డ సంస్కారానికి భిన్నంగా రాయటంవల్ల ప్రజలు కొద్దికాలం నిరాదరణ చూపిస్తారు. కాని—కొద్దికాలం మాత్రమే. రోజులు గడిచినకొద్దీ ఈ రచయితలకే పలుకుబడి ఎక్కువ అవుతుంది. "వాళ్ళకు నచ్చ లేదు" అని విచారపడవలసిన అవసరం వుండదు.

వాళ్ళకు తప్పకుండా నచ్చితీరాలి. ఎందుకంటే వాళ్ళకోసమేగా! రచయితలు సరిగ్గారాస్తే నచ్చకపోవటం అనేది ఉండదు. నచ్చలేదని నిదించటం కానీ, విచారిం చటం కానీ మంచిలక్షణం కాదు.

కనక ప్రజాసామాన్యానికి శ్రేయస్సు కూర్చే భావాలను వాళ్ళకు నచ్చేటట్టు చెప్పటమే ఉత్తమ రచన అవుతుంది.

[ఇందులోని భావాలు 'నచ్చలేదు' అనే
నా రేడియో ప్రసంగంలోవి.]

ఆత్మ విశ్వాసం

ఈమధ్య భాషాభిషక్కుల్లో చాలా అహంకారం బలిసినట్లు కనిపిస్తుంది. దీనికికారణం ఏమిటా అని నేను చాలా ఆలోచించాను. నాకు ఒక్కటే తట్టింది. చాలామంది పెద్దవాళ్ళు ఆత్మవిశ్వాసం మనిషికి అవసరమనిచెప్పారు. ఈ అభిప్రాయమే భాషాభిషక్కుల్లో అహంకారాన్ని పెంచిందని నా అనుమానం.

కాని ఈ భాషాభిషక్కులు ఒక సంగతిమాత్రం మరచి పోగూడదు. ఆత్మవిశ్వాసం రెండురకాలుగా కలుగుతుంది. ఒకటి జ్ఞానం వల్లా; రెండు అజ్ఞానంవల్లా.

సర్వమూ తెలుసుకొని, అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒకరను కుంటారు. బాహ్యప్రపంచమే తెలియకపోవటంవల్ల అందరికంటే నాకు ఎక్కువ తెలుసని ఒకరనుకుంటారు.

మన భాషాభిషక్కులు ఈ రెండోరకానికి చెందుతారేమో నని నా భయం.

ఈమాట అన్నానని కోప్పడవద్దు. మాప్పకోవటం మంచిది. లేకపోతే ఆత్మవిశ్వాసాన్ని పొందేటంత జ్ఞానాన్ని సంపాదించటం మంచిది.

—o—